## క్లుప్తంగా

### ఘనంగా మహాకవి గురజాడ జయంతి



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్...దేశమంటే మనుషులోయి అని చాటిచెప్పిన గొప్ప కవి గురజాడ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, స్థానిక నాయకులు అబద్దం, కందుల వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లక్కోజు ఆదిమూర్తి, గట్టిం పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీత శిక్షణకు విశేష స్పందన



తిమ్మరాజుపేటలో భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న పరదేశినాయుడు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో నిర్వహిస్తున్న భగవద్గీత శిక్షణ కార్యక్రమానికి పిల్లల నుంచి విశేష స్పందన వస్తోంది. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతీ ఆదివారం మునగపాకకు చెందిన విశ్రాంత పంచాయతీ ఇంజినీర్ శరగడం పరదేశినాయుడు భగవద్గీతపై శిక్షణ ఇస్తున్నారు. పలువురు పిల్లలు భగవద్గీతపై అవగాహన పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ. 5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వామ్యులవుతున్నారు. వివిధ గ్రామాలకు చెందిన వారు తమవంతు సాయం అందజేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు రాజశేఖర్

యలమంచిలి రూరల్: పట్టణంలోని నెహ్రూనగర్ వార్డు సచివాలయంలో గతనెల 28వ తేదీన జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడు అన్నెపు రాజశేఖర్(21)ను ఆదివారం అరెస్ట్ చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు.నెహ్రూనగర్ వార్డు సచివాలయంలో రెండు మానిటర్లు,రెండు సీపీయూలు,కీబోర్డు చోరీకి గురైన సంగతి తెల్సిందే.దీనిపై గత నెల 29న ఆ వార్డు సచివాలయం శానిటరీ కార్యదర్శి మోటూరు నరేంద్ర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు స్థానిక ఫైర్ ఆఫీస్ కాలనీలో నివాసముంటున్న నిందితుడిని పట్టుకున్నారు.నిందితుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట గ్రామంగా పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఆదివారం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళ దాతను సత్కరిస్తున్న చెరువు కాలువ సంఘ రైతులు

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో నిర్మిస్తున్న సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి.పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు.ఆదివారం మునగపాకకు చెందిన వేగి సూర్యనారాయణ కుమారుడు వేగి తులసీ వంశీ(అమెరికా) తనవంతు సాయంగా రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను రైతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ రైతులు బొడ్డేడ అప్పలనాయుడు,బొడ్డేడ రామారావు, దాడి చంద్రరావు,వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, దాడి వెంకటరావు,వెలగా శ్రీనివాసరావు,వ రమేష్, దాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం



ఉత్సవాలకు సిద్ధమైన యలమంచిలి దిమిలి రోడ్డులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



గాంధీ నగరం వీధిలో నవరాత్రి ఉత్సవాల కోసం వేసిన ప్రత్యేక పందిరి



మండపంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన అమ్మవారి విగ్రహం

- వాడవాడలా మండపాలు
- ముస్తాబైన ఆలయాలు

యలమంచిలి రూరల్: దసరా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.ఏటా 9రోజుల పాటు జరిగే ఉత్సవాలు, ఈ సారి తిథుల్లో హెచ్చుతగ్గుల కారణంగా 11 రోజుల పాటు జరగనున్నాయని వేద పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచే యలమంచిలి పట్టణం,మండలంలో సందడి నెలకొంది. పలు ఆలయాలు, మండపాల్లో ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. యలమంచిలి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో గాయత్రీ ఆధ్యాత్మిక పీఠంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ రెండుచోట్ల అమ్మవారిని ప్రతిరోజూ వివిధ రూపాల్లో అలంకరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పద్మనాభరాజుపేట దుర్గాదేవి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయాల్లోనే కాకుండా ఉత్సవాలను గ్రామగ్రామాన,వీధుల్లో నిర్వహించడానికి ప్రత్యేక పందిళ్లు ఏర్పాటయ్యాయి.సోమవారం ప్రారంభమయ్యే ఉత్సవాలు వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతాయి.పలువురు భవానీ మాల ధారణ చేసి మండపాల వద్ద పూజల్లో పాల్గొననుండడంతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతుంది.ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలు,పందిళ్ల వద్ద భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నక్కపల్లి: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. వాడవాడలా దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి, ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం, కాగిత గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం కుంకుమపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో మండపాల వద్ద ఏర్పాటు చేసేందుకు వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను నెలరోజుల ముందే ఆర్డర్ చేశారు. ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. నక్కపల్లి, ఉద్దండపురం, దేవవరం, గొడిచర్ల, వేంపాడు, చినదొడ్డిగల్లు, నెల్లిపూడి, అడ్డురోడ్డు జంక్షన్, కొరుప్రోలు, పాయకరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లు, ఆటోస్టాండ్ల వద్ద నవరాత్రులు నిర్వహించనున్నారు.



కాగితలో దుర్గాదేవి ఆలయం

#### ఉపమాకలో...

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ప్రతి రోజు కుంకుమ పూజలు జరుగుతాయని అర్చకులు వరప్రసాద్ తెలిపారు. పల్లకిలో అమ్మవారికి తిరువీధి సేవ నిర్వహిస్తామన్నారు. చినదొడ్డిగల్లు శ్రీరామపంచాయతన ఆలయంలో దేవినవరాత్రులు ఘనంగా నిర్వహించనున్నట్టు ధర్మకర్త శ్రీపాద సత్యదేవ శర్మ తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. పాయకరావుపేట పట్టణంలో దుర్గాలమ్మ చెట్టు వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాదికూడా శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక కుంకుమపూజలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# అధ్వానంగా గ్రంథాలయాల నిర్వహణ

- సక్రమంగా తెరుచుకోని లైబ్రరీలు
- ఇబ్బంది పడుతున్న పాఠకులు, విద్యార్థులు



ఎస్‌రాయవరం గ్రంథాలయం మూసివేయడంతో గేటు వద్ద పడేసిన పత్రికలు



కొరుప్రోలు గ్రంథాలయంలో బయట కూర్చొని పత్రిక చదువుతున్న పాఠకులు

ఎస్.రాయవరం: ఒకప్పుడు గ్రామాల్లో విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లిన గ్రంథాలయాల నిర్వహణ ప్రస్తుతం అధ్వానంగా మారింది. దీంతో గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎస్.రాయవరం మండలంలో ఉన్న రెండు గ్రంథాలయాల నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని, నెలల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడంటూ పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండల కేంద్రం ఎస్.రాయవరంలో పనిచేసిన గ్రంథాలయాధికారి రెండు నెలల కిందట పదవీ విరమణ చేయడంతో రాంబిల్లి నుంచి ఇన్‌చార్జ్‌ను నియమించారు. ఈమె వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నారు. వచ్చిన రోజు బయట వరండాలో పడిన పత్రికలను సర్దుకుని గదిలో పెట్టి తాళం వేసుకుని వెళ్లిపోతున్నారంటూ పాఠకులు ఆరోపిస్తున్నారు. దీంతో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే నిరుద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరండాలో పడేసిన పత్రికలు చదివి, వెనుదిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. కొరుప్రోలు గ్రంథాలయంలోకూడా ఇదే సమస్య. ఇక్కడ గ్రంథాలయాధికారి లేరు. సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో ఔట్‌సోర్సింగ్‌లో నియమితుడైన ఉద్యోగి మానేశాడు. దీంతో స్వీపర్ కం అటెండరు మాత్రమే ఉన్నారు. ఇక్కడ కూడా పాఠకులకు వరండాలో అందుబాటులో ఉన్న పత్రికలే దిక్కు. అవి మాత్రమే చదుకుని వెళ్లిపోవాల్సి వస్తోంది. కూర్చోడానికి సరైన వసతి లేదు. ఫ్యాన్లు లేవని పాఠకులు వాపోతున్నారు. ఇతర గ్రంథాలు, పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంటోంది. వీటిని అటెండర్ ఇవ్వడం లేదని పాఠకులు వాపోతున్నారు. ఇక వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరాలు సహితం ఈ రెండు గ్రంథాలయాల్లో జరగలేదు. అధికారులు స్పందించి ఈ రెండు గ్రంథాలయాలను సక్రమంగా తెరిచేలా చర్యలు తీసుకోవాలని పలువురు పాఠకులు కోరుతున్నారు.

#### పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు



గతంలో గ్రంథాలయాలకు వెళ్తే అన్ని పుస్తకాలు, గ్రంథాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రంథాలయాలు నిత్యం మూసే ఉంటున్నాయి. అటెండర్లు మాత్రమే ఉంటున్నారు. పత్రికలు తప్ప మరేమీ అందుబాటులో ఉండటం లేదు. గ్రామీణ ప్రాంతాల వారికి గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. ఇటీవలకాలంలో గ్రంథాలయా నిర్వహణ అధ్వానంగా ఉంది.

–రాంబాబు,పాఠకుడు గోకుల పాడు

#### పత్రికలు మాత్రమే ఇస్తున్నారు



కొరుప్రోలు గ్రంథాలయంలో పత్రికలు తప్ప ఇంకేమీ అందుబాటులో ఉండటం లేదు. స్వీపర్ మాత్రమే ఉంటున్నారు. పత్రికలు తప్ప ఇతర పుస్తకాలు ఇవ్వడం లేదు.అధికారులు స్పందించి సిబ్బందిని నియమించి గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలి.

హర్షవర్ధన్, విద్యార్థి, కొరుప్రోలు

## 12న జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన



సినీ దర్శకుడు సత్యానంద్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామీణ సాంస్కృతిక సంస్థ సభ్యులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో వచ్చేనెల 12న ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజ్‌దాస్ జయంతి సందర్భంగా జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం సినీ దర్శకుడు ఎల్.సత్యానంద్‌తో పాటు పలువురు పెద్దలకు అందజేసినట్టు చెప్పారు. నందీశ్వర తులసీ కళా వేదికపై రాత్రి 8.30గంటలకు సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్, సంస్కార భారతి సంయుక్త నిర్వహణలో నాటకాన్ని ప్రదర్శించనున్నారు. 60 మందికి పైగా కళాకారులు ఈ నాటకంలో ప్రదర్శన ఇస్తారన్నారు. ఈ నాటకానికి రచన,దర్శకత్వం డాక్టర్ పీఏస్ కృష్ణ వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, యువ రచయిత ఆడారి సోమశేఖర్, సీనియర్ కళాకారులు కాండ్రేగుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ‘చలో విశాఖ డెయిరీ’ని విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు అప్పారావు

మునగపాక: ఈ నెల 24వ తేదీన జరగనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని ఏపీ రైతుసంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. నాగులాపల్లి, ఒంపోలు, మునగపాక తదితర గ్రామాల రైతులతో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలోనే పాడి రైతులకు కల్పతరువుగా ఉన్న విశాఖ డెయిరీని తమ స్వార్థ ప్రయోజనాల కోసం అవినీతి మయం చేస్తున్నారన్నారు. రైతులను నష్టాల పాలు చేస్తూ సొంత ఆస్తులను పెంచుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు లాభాలు రాకుండా విశాఖ డెయిరీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వందల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. డెయిరీ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ,రైతులు పాల్గొన్నారు.

## హస్త కళాకారుడు ఏసుదాసుకు సన్మానం



హస్తకళాకారుడు ఏసుదాసును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: లేపాక్షి సావనీర్ హ్యాండీక్రాఫ్ట్ డిజైన్–2025 పోటీల్లో పీపుల్స్ ఛాయిస్ అవార్డు పొందిన ఏటికొప్పాకకు చెందిన పెదపూడి సుబ్రహ్మణ్యం ఏసుదాసును ఆదివారం రాత్రి పట్టణం,మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు.పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు క్యాంపు కార్యాలయంలో ఏసుదాసుకు దుశ్శాలువాతో నాయకులు సత్కరించి,అభినందించారు. ఖండాంతర ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీదారులు తరచూ తమ సృజనాత్మకత,నైపుణ్యంతో తమ ప్రతిభను చాటిచెబుతున్నారు. తాజాగా ఏసుదాసు పచ్చదనం వర్సెస్ కాలుష్యం అంశానికి సంబంధించి రూపొందించిన కళాఖండం పలువురి ప్రశంసలు అందుకోవడం పట్ల నాయకులు హర్షం ప్రకటించారు. భవిష్యత్తులో ఏసుదాసు అరుదైన కళాఖండాలు తయారుచేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ బోదెపు గోవింద్ ఆకాంక్షించారు. తనను సత్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు ఏసుదాసు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ,రూరల్ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర,కొల్లి త్రినాథరావు,మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా,వార్డు కౌన్సిలర్లు రాపేటి సంతోష్,గొర్లి వెంకట్,పిట్టా సత్తిబాబు, పార్టీ నాయకులు వీసం బంగారి,షేక్ మహబూబ్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో నిర్లక్ష్యం




యలమంచిలి ప్రధాన రహదారిపై విద్యుత్ సరఫరా లేకపోవడంతో పరిస్థితి

యలమంచిలి రూరల్: ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు వీధుల్లో చెట్లు నేలకొరగడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారితో సహా వీధుల్లో అంధకారం అలుముకుంది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో ఆ శాఖ అధికారులు విఫలమయ్యారని, వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ ఆరోపించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే స్థానిక ఏఈ, ఏడీఈలు అందు బాటులో లేకపోవడం,ఫోన్ చేసినా స్పదించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు సైతం ప్రజల ఇబ్బందులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అపార్టుమెంట్లు,డాబా ఇళ్లలో నివసించేవారంతా ట్యాంకుల్లో నీళ్లు లేక తీవ్ర అవస్థలు పడ్డారు.హోటళ్లు,రెస్టారెంట్లతో పాటు చిరువ్యాపారులు,పాల వ్యాపారులు, యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో రోగులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

## ఫుట్‌పాత్ వ్యాపారుల పొట్టకొట్టడం అన్యాయం

అనకాపల్లి: పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసే చిరువ్యాపారుల పొట్ట కొట్టడం అన్యాయమని సీపీఐ జిల్లా నాయకుడు వైఎన్.భద్రం అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరువ్యాపారులపై జోనల్, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. చిరువ్యాపారాలు చేసుకునేందుకు ప్రత్యేక స్థలాన్ని చూపించాలని కోరారు.

## రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

యలమంచిలి రూరల్: ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని కూరగాయల వ్యాపారి గొలుసుపూడి శ్రీనివాస బుజ్జి,శ్యామల దంపతులు అన్నారు.రక్తదానం..ప్రాణదానంతో సమానమని, ఈ చిన్న దానమే ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు.సంకల్పం స్వచ్ఛంద సేవాసంస్థ సౌజన్యంతో బుజ్జి దంపతులు ఆదివారం స్థానిక కోర్టు కూడలి వద్ద రక్తదాన శిబిరం,మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 63 మంది రక్తదానం చేశారు.అనంతరం రక్తదాతలకు నిర్వాహకులు హెల్మెట్లు,మొక్కలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానికులకు 400 మొక్కలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు,స్థానికులు శిబిరాన్ని సందర్శించారు. సంకల్పం సంస్థ వ్యవస్థాపకులు వరప్రసాద్,శంకర్,భాను,సత్య పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న కళాకారులు

మునగపాక: స్థానిక బీసీ కాలనీలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. విశ్వకర్మ జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఐదు రోజులుగా కాలనీలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక కళాకారులతో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. విశ్వకర్మ విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ప్రజలను మోసగించిన చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ
- సోమలింగపాలెం,కట్టుపాలెం గ్రామాల్లో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: ఏదో చేస్తారని ఆశపడి,ఓట్లేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజలను మోసం చేశారని యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి ‘బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ గ్రామస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకట్లోనే మండల పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో బాబు మోసాలపై రచ్చబండ నిర్వహించి, హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును వివరించారు.సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసగించిందో తెలియజేశారు. కొత్తగా ఎవరికైనా పింఛన్లు ఇవ్వాలంటే కొంతమంది లబ్ధిదారులు చనిపోతేనే ఇస్తామన్న ఘనుడు చంద్రబాబు అని అన్నారు. 2024 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారని, చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేశారని ఆరోపించారు. చంద్రబాబు,కూటమి నాయకులు ఎన్నికల సమయంలో సాధ్యంకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను వంచించడంతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారని గుర్తు చేశారు. కేవలం ఎన్నికల్లో గెలవడానికి సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలను గుప్పించి వాటిని అమలు చేయకుండా మోసం చేసే నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది కేవలం చంద్రబాబునాయుడేనన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి, ధనవంతులు, పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చుతున్న చంద్రబాబుకు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని అభిప్రాయపడ్డారు. ప్రశ్నించినవారిని అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రజల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసేవారిని అధిష్టానం కచ్చితంగా గుర్తిస్తుందన్నారు.

**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను నెలకొల్పితే వాటిలో 10 కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని,ఈ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ రాజీలేని పోరాటం చేస్తుందని ధర్మశ్రీ స్పష్టం చేశారు.ఇలాంటి చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, సోమలింగపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు పిల్లా గోవింద అయ్యలనాయుడు, పందూరి గోవింద్, తంటపురెడ్డి ఆనంద్, పందూరి నాగేషు, నానేపల్లి నాగసత్యనారాయణ, రావాడ రాము, ఉల్లింగల పైడినాయుడు, కర్రి శ్రీను, కర్రి నాయుడు, పొలమరశెట్టి రామారావు, పిల్లా రామకృష్ణ, వేగి ఆదినారాయణ, యల్లపు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.